సాక్షి
వికారాబాద్
గురువారం । 14 । ఆగస్టు । 2025



ఆస్పత్రికి తాళం!

ధారూరు మండలంలో పశువైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 8లో▸



డ్రగ్స్ రహిత..

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దుద్యాల్ ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. 8లో▸



ఆదమరిస్తే అంతే!

యాలాల ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

అనంతగిరి: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేడు, రేపు(గురు, శుక్రవారం) సెలవు ఇస్తున్నట్లు డీఈఓ రేణుకాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

జిల్లా వైద్యాధికారి లలితాదేవి



108 వాహనాన్ని పరిశీలిస్తున్న లలితాదేవి

మోమిన్‌పేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి లలితా దేవి పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట పీహెచ్‌సీని సందర్శించారు. 108 వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు తక్షణ సేవలు చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజల తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం పీహెచ్‌సీ సందర్శన

బంట్వారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ లలితాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపైఅప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం ఓపీ సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రహీం, సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, ఎల్‌టీ రవి, అంబులెన్స్ టెక్నీషియన్ శివకుమార్, పైలెట్ బాల్‌రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు డెంగీ కేసులు



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: వానాకాలం సీజన్ కావడంతో డెంగీ మహమ్మారి విజృంభిస్తోంది. 24 గంటలు తిరగక ముందే తాండూరు పట్టణ పరిధిలో మరో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో అప్రమత్తమైన వైద్య, మున్సిపల్ సిబ్బంది ఉరుకులు పరుగులు తీశారు. మంగళవారం రాజీవ్ కాలనీలో ఓ వ్యక్తికి డెంగీ సోకిన విషయం విధితమే. తాజాగా బుధవారం గరీబ్ నగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు డెంగీ బారిన పడ్డారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మాలాశ్రీ నేతృత్వంలో వైద్య సిబ్బంది ఆ వార్డుకు వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డు పరిధిలో రసాయనాలను పిచికారీ చేయించారు. వర్షాకాలంలో పూలకుండీలు, టైర్లు, పాడైపోయిన వస్తువుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వాలు పెరిగే అవకాశం ఉందని, కావున నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

తాండూరు టౌన్: మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్, గంజాయి వంటికి అలవాటు పడి తే జీవితం చీకటిమయం అవుతుందన్నారు. వ్యసనాలకు బానిసలు కాకుండా బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇటీవల పరిగి - వికారాబాద్ మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న వాహనదారులు



వాగు.. పారితే ఆగు

జిల్లాకు అతిభారీ వర్ష సూచన

- అన్ని కాజ్‌వేల వద్ద పోలీసుల మోహరింపు
- పలు చోట్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జిలు
- సహాయక చర్యలకు ఉపక్రమించిన యంత్రాంగం

వికారాబాద్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలు.. పొంగిపొర్లుతున్న వంకలు.. అలుగు పారుతున్న చెరువులు ప్రజలకు ఆందోళనకు గురి చేస్తుంటే మరో రెండు మూడు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు మరింతగా భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ యంత్రాంగాన్ని ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా మండలాల్లోని లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద పోలీసులు మోహరించారు. ప్రమాదకరంగా ప్రవహించే వాగులు దాటరాదని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని కలెక్టర్, ఎస్పీ ప్రజలకు సూచించారు. మూడేళ్ల క్రితం జిల్లాలో భారీ వర్షాలకు అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రాణ ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే.. కొన్ని చోట్ల అజాగ్రత్త ప్రాణాలను హరించగా మరి కొన్ని చోట్ల ఊహించని వరద ఉధృతి రెప్పపాటులో కబళించి వేసింది. ఇంకొన్ని చోట్ల మానవ తప్పిదాలతో ప్రాణాలు గాల్లో కలిశాయి.

గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు

- గడిచిన మూడేళ్లలో జిల్లాలో భారీ వర్షాల కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కొందరు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడి మరణించారు. వంతెనలు దాటే క్రమంలో వాహనాలు ప్రమాదాలకు గురి కావడంతో మరి కొందరు మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలు కొన్ని..
- ధారూరు మండలంలో పొంగిపొర్లుతున్న వాగును దాటే క్రమంలో ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. ఐదు మంది రైతులు గల్లంతు కాగా తోటివారు రక్షించారు.
- తాండూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి పక్క గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది.
- మూడేళ్ల క్రితం అతి భారీ వర్షాలకు జిల్లాలోని వాగులు పొంగిపొర్లడంతో వరద ప్రవాహంలో ఏడుగురు చిక్కుకొని మరణించారు. మరో 11 మంది ప్రాణాలతో బయటపడ్డారు.
- ప్రస్తుతం కూడా అదే తరహాలో వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆస్తి నష్టం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండరాదని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వరద ఉధృతి ఉంటే వాగులు దాటే ప్రయత్నం చేయరాదు. జిల్లాలోని ప్రమాదకర కాజ్‌వేల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. అవసరం ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటికి రాకూడదు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లకపోవడం మంచిది కాదు. ఏది ఏమైనా సమయం ప్రాణం కంటే విలువైనది కాదు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. వరద ఉధృతి ఉంటే మరో మార్గంలో గమ్యస్థానాలకు చేరుకోవాలి. చెరువు అలుగుల వద్ద సాహసాలు చేయటం, సెల్ఫీలు దిగటం లాంటివి చేయకూడదు.

– నారాయణరెడ్డి, ఎస్పీ

అప్రమత్తంగా ఉండండి

- జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లపై అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుస సెలవుల నేపథ్యంలో అనంతగిరికి పర్యాటకులు రాకూడదని సూచించారు. అనంతగిరి ట్రెక్కింగ్‌ను మూసి వేయనున్నట్లు తెలిపారు. అధికారుల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రెడ్ అలెర్ట్ ప్రకటించినందున ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటికి రాకూడదన్నారు. ప్రజలకు, పశువులకు ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకుని 24 గంటల పాటు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దెబ్బతిన్న పాఠశాలల భవనాలను, హాస్టళ్లను గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి అందులోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అతి భారీ వర్షం పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సెల్ నంబర్లకు 79950 61192, 08416235291 సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ఘనంగా చేయాలి

స్వాతంత్య్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించే మైదానాన్ని బుధవారం పరిశీలించారు. వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు.

ప్రజావాణి రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 18న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు కలెక్టరేట్ రాకుడదన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, ఆర్‌డీఓ వాసుచంద్ర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆది కర్మయోగి అభియాన్‌లో భాగంగా గిరిజనుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఇళ్లు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేకుంటే మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, డీపీఓ జయసుధ, డీఈఓ రేణుకా దేవి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవి, చల్మారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం పందికొక్కుల పాలు

- ఒక్క కొడంగల్‌లోనే 750 క్వింటాళ్లు
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- డీలర్ల వద్ద మగ్గి, పురుగు పడుతున్న వైనం
- పట్టించుకోని జిల్లా అధికారులు

కొడంగల్: రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా మారింది జిల్లా అధికారుల తీరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉగాది కానుకగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ మాసం నుంచి సన్నాలు పంపిణీ చేశారు. మార్చి నెల వరకు రేషన్ డీలర్ల దగ్గర మిగిలిన మిగులు దొడ్డు బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు లెక్క కట్టి డీలర్ల దగ్గరే ఉంచారు. ఐదు నెలలు గడుస్తున్నా వాటి గురించి అధికారులు ఆలోచించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జూన్ నెలలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి వినియోగదారులకు అందజేశారు. జూన్ నెల చివరి వరకు దుకాణాలను తెరిచి సన్న బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ దుకాణాలను తెరవక పోవడంతో మిగిలిన ఉన్న దొడ్డు బియ్యం పంది కొక్కుల పాలవుతోంది. బియ్యానికి పురుగు పట్టి చెడిపోతున్నాయి. డీలర్లు కూడా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. అంతేకాకుండా మిగులు బియ్యాన్ని రేషన్ దుకాణాల్లో ఉంచడం వల్ల సన్న బియ్యానికి కూడా పురుగు పడుతోంది. గ్రామాల్లో రేషన్ దుకాణాలు చాలీచాలనీ స్థలంలో ఉన్నాయి. చిన్న పాటి దుకాణాలు ఉన్నాయి. అందులో దొడ్డు బియ్యం, సన్న బియ్యాన్ని ఉంచుకోడానికి డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిరుపయోగంగా ఉన్నాయి. పనికి రాకుండా పోతున్నాయని డీలర్లు వాపోతున్నారు.



కొడంగల్‌లోని రేషన్ షాపులో దొడ్డుబియ్యం

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 588 రేషన్ దుకాణాల ద్వారా 8,97,270 మంది వినియోగదారులకు ప్రతి నెలా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలో ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా ఇస్తున్నారు. అలాగే 2.09 లక్షల ఆహార భద్రత కార్డులు, 25వేల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 5,200 టన్నుల అలాట్‌మెంట్ ఉంది. ఈ లెక్కన జిల్లాలోని మొత్తం రేషన్ దుకాణాల్లో మిగిలి ఉన్న బియ్యం వేలాది క్వింటాళ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని దొడ్డు బియ్యం తంటా తెంపాలని డీలర్లు కోరుతున్నారు.

హత్య కేసులో ఇద్దరికీ జీవిత ఖైదు

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో 2012లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. ఎస్.శ్రీనివాస్ రెడ్డి జీవిత ఖైదు విధించారని ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. అప్పట్లో పట్టణంలోని బీటీఎస్ కాలనీకి చెందిన మిర్యాల భాగ్యలక్ష్మిని ఆమె భర్త మిర్యాల రాజు, అతని పెదనాన్న కుమారుడు మల్లేశం కలిసి దారుణంగా హత్య చేశారు. మిర్యాల రాజు జులాయిగా తిరుగుతూ, మద్యానికి బానిసయ్యాడు. తన ఇంటిని అమ్మాలని ప్రయత్నించగా, భార్య భాగ్యలక్ష్మి పిల్లల భవిష్యత్తు కోసం వద్దని వేడుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు.. మల్లేశంతో కలిసి మే 29న భాగ్యలక్ష్మి మెడకు కేబుల్ వైర్ బిగించి హత్య చేశాడు. మృతురాలి తల్లి కుర్వ కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వికారాబాద్ సీఐ లచ్చిరాం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి చార్జ్ షీట్ దాఖలు చేశారు. సమగ్ర దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల ఆధారంగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డా. ఎస్.శ్రీనివాస్ రెడ్డి వాదోపవాదనలు విని, నిందితులు మిర్యాల రాజు, మల్లేశంలను దోషులుగా నిర్ధారించారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుధాకర్ రెడ్డి, మొదటి దర్యాప్తు అధికారి లచ్చిరాం, అప్పటి ఎస్ఐ శ్రీనివాస్, ప్రస్తుత వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భీమ్ కుమార్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎల్.నరేందర్, లైజన్ ఆఫీసర్ బి.వీరన్న (ఎస్ఐ)లను ఆయన పేరు పేరునా ప్రశంసించారు.



పరిగి: మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు

పరిగి: పెండింగ్ ఫైళ్లను వెంటనే పూర్తిచేసి న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం పరిగి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సంఘటనలను కూడా తక్కువ అంచనా వేయరాదని, వాటిపై కూడా నిఘా ఉంచాలని పేర్కొన్నారు. దొంగతనాల కేసుల పట్ల ప్రత్యేక చొరవ చూపి వాటిని త్వరగా ఛేదించాలని సూచించారు. సీసీ కెమెరాల ఆవస్యకతను ప్రజలకు వివరించి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: మండలంలోని వట్టిమీనపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనును బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, పశువుల పాకల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ విజయ్ కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, ఈసీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు గీత, నితిన్, టీఏ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులు

ఎంఈఓ వెంకటయ్య

తాండూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులు ఇవ్వాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ పేరిట ఈ నెల 11న ప్రభుత్వం సంబంధిత అధికారులకు ప్రొసీడింగ్‌లు పంపించింది. ఈ విభాగంలో విద్యార్థులకు 20శాతం మార్కులను కేటాయిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో జిల్లాలో టెన్త్ చదువుతున్న సుమారు 13 వేల మంది విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు వేయనున్నట్లు తాండూరు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. గతంలో మాదిరిగానే అంతర్గత మూల్యాంకణం మార్కులు ఉంటాయని వెల్లడించారు.

పసుపు సాగుకు మొగ్గు

ధర బాగుండటంతో రైతుల ఆసక్తి

- గత ఏడాది 50 ఎకరాల్లో..
- ఈ సారి దాదాపు 200 ఎకరాల్లో పంట

మోమిన్‌పేట: రెండు దశాబ్దాల క్రితం వరకు నీటి వసతి ఉన్న ప్రతి రైతూ పసుపు పంట సాగు చేశాడు. అర ఎకరం నుంచి మూడెకరాల వరకు పంట పండించేవారు. అప్పట్లో పసుపు దిగుబడికి మార్కెట్‌లో ధర లేకపోవడం, పెట్టుబడి కూడా భారీగా పెట్టాల్సి ఉండటంతో చాలా మంది ఇతర పంటల వైపు మళ్లారు. గత ఏడాది కేవలం 50 ఎకరాల్లో మాత్రమే పంట వేయగా ప్రస్తుత సీజన్‌లో 150 నుంచి 200 ఎకరాల వరకు సాగు చేశారు. రెండు మూడేళ్లుగా పసుపు పంటకు డిమాండ్ ఉండటం, క్వింటాలు రూ.10 వేలకు పైగా ధర పలుకుతుండటంతో ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు.

ఖర్చులు అధికం

ఇతర పంటలతో పోలిస్తే పసుపు సాగుకు ఖర్చు ఎక్కువ. ఒక ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. గతంలో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చేది. క్వింటాలు ధర రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పలికేది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ప్రస్తుతం సాగులో నూతన పద్ధతులు రావడంతో పంట దిగుబడి బాగా వస్తోంది. అంతేకాకుండా దిగుబడికి మంచి డిమాండ్, ధర ఉంటోంది. దీంతో ఎక్కువ మంది రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు.



మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లిలో సాగు చేసిన పసుపు పంట

ఆధునిక పద్ధతిలో..

పాత పద్ధతిలో కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పసుపు పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాగలి వెంట విత్తనం వేయడం కాకుండా బోజ, బెడ్డు పద్ధతిలో సాగు చేస్తున్నారు. బెడ్డులో విత్తనం తక్కువ పట్టడం, డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టడం ద్వారా కొంత మేర కూలీల ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులు అంటున్నారు. బెడ్, డ్రిప్ పద్ధతిలో భూమి గుల్లగా ఉండి కొమ్ము సాగుకు అనుకూలంగా ఉంటుందని, అంతేకాకుండా దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఎరువులు, నీటి యాజమాన్యం సరైన పద్ధతిలో పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారి అక్షితారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం మే నెలలో విత్తన రాయితీ ఇచ్చి ఉంటే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉండేదని రైతులు తెలిపారు. చాలా మంది విత్తుకున్న తర్వాత దరఖాస్తులు స్వీకరించడం ద్వారా రైతులు ప్రభుత్వ సదుపాయం పొందలేక పోయారు.

క్లుప్తంగా

ఒకే కాన్పులో రెండు లేగదూడలు జననం


లేగదూడలు

కుల్కచర్ల: ఒకే కాన్పులో రెండు లేగదూడలు జన్మించిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కుల్కచర్ల మండలం ఘణపూర్ గ్రామంలో కొండ నర్సింలు అనే రైతుకు చెందిన ఆవు ఒకే కాన్పులో రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఆవుకు ఒక కాన్పులో ఒక్కటే జన్మించే అవకాశం ఉంటుంది. కానీ రెండు లేగదూడలు జన్మించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘటనను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు.

మీ సేవ సెంటర్ సీజ్


ధారూరులోని మీ సేవ సెంటర్‌కు తాళం వేయిస్తున్న ఆర్ఐ దేవేందర్‌రెడ్డి

ధారూరు: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న మీ సేవ కేంద్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దేవేదర్‌రెడ్డి బుధవారం సీజ్ చేశారు. తహసీల్దార్ సాజిదాబేగం ఆదేశం మేరకు సెంటర్‌ను మూసేస్తున్నట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి వద్ద ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెండింతల ఫీజు వసూలు చేస్తున్నారనే వరుస ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఆర్ఐ ఎదుటే.. నాగసమందర్‌కు చెందిన ఓ విద్యార్థి వద్ద రూ.45కు బదులు రూ.80 తీసుకోవడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. అనంతరం కేంద్రాన్ని సీజ్‌చేసి తాళాలు తీసుకెళ్లారు.

దివ్యాంగుల హామీలు నెరవేర్చాలి


బొంపల్లిలో దివ్యాంగులతో నాయకులు

దోమ: దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్‌మాదిగ అన్నారు. మండల పరిధిలోని బొంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న పరిగి పట్టణంలోని శారద గార్డెన్‌లో నిర్వహించే సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నా వికలాంగుల సమస్యలు తీరడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.6 వేల పెన్షన్, బ్యాటరీ మోటార్ సైకిళ్లు, ట్రైసైకిళ్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు బొంపల్లి వెంకటేశ్, అంజి, కుర్వ ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'నషాముక్త్ భారత్' ప్రతిజ్ఞ


వికారాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం జిల్లా అబ్కారీ అధికారి కె.విజయభాస్కర్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024– 25 సంవత్సరానికి సంబంధించి మొత్తం 37 కేసుల్లో 244.792 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని 44 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె.రాఘువీణ, ఎస్ఐ కె.వీరాంజనేయులు, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్‌లో సంతకం ఆస్పత్రికి తాళం!

- ధారూరు వెటర్నరీ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం
- మూగజీవాలను తీసుకువచ్చి పడిగాపులు కాసిన రైతులు
- దవాఖానాను తనిఖీ చేసిన జిల్లా పశువైద్యాధికారి


ఫోన్‌లో మాట్లాడుతున్న సదానందం


ధారూరులోని వెటర్నరీ ఆస్పత్రి ఎదుట గేదెను కట్టేసి పడికాపులు కాస్తున్న రైతులు

ధారూరు: మండలంలో పశువైద్యం అందని ద్రాక్షగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధారూరుకు చెందిన ఓ రైతు తన గేదెకు చూడి ఇంజక్షన్ వేయించేందుకు, లక్ష్మీనగర్‌తండాకు చెందిన మరో రైతు తన మేకలకు వైద్యం చేయించేందుకు, గట్టెపల్లి, రుద్రారం, డీకేతండాకు చెందిన మరికొందరు రైతులు తమ పశువులను వైద్యం కోసం బుధవారం స్థానిక వెటర్నరీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అంతకు ముందే ఆస్పత్రికి వచ్చిన ఇన్‌చార్జ్ డాక్టర్ కుమారస్వామి, అటెండర్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి ఆస్పత్రికి తాళం వేసి వెళ్లిపోయారు. ఈ విషయం తెలియని రైతులు గంటల తరబడి మూగజీవాలతో అక్కడే పడిగాపులు కాశారు. వెటర్నరీ సిబ్బంది ఆస్పత్రిలో లేరనే విషయం తెలియడంతో జిల్లా పశువైద్యాధికారి సదానందం ఆస్పత్రికి చేరుకున్నారు. రికార్డులను పరిశీలించగా విధులకు హాజరైనట్లు సంతకాలు చేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పని నిమిత్తం ఒకరు అనుమతి తీసుకుని వెళ్లారని, మిగిలిన ఇద్దరు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రిని ఓపెన్ చేసి పెట్టాల్సిన అటెండర్ సైతం దుమ్మా కొట్టడం సహించలేనిదని మండిపడ్డారు. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉండటంపై అసహనం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న వారి ఫోన్ నంబర్లు అందరికీ కనిపించేలా పేపర్‌పై రాసి అతికించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బాబురావుకు సూచించారు. జిల్లాలో 33 వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఉండగా 20 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఖాళీలు ఉన్న చోట ఒకరికి రెండు మూడు చోట్ల అదనపు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. 70 మంది కాంపౌండర్లకు గానూ కేవలం 30 మంది మాత్రమే ఉన్నారని వెల్లడించారు. పశువులకు సకాలంలో వైద్యం అందకపోవడానికి సిబ్బంది కొరత కూడా ప్రధాన కారణమని తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాండూరు టౌన్: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారు జామున తాండూరు నుంచి వికారాబాద్ వైపు వెళ్తున్న రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తికి 55 ఏళ్ల వయసు ఉంటుందని, ఒంటిపై నీలం, ఎరుపు రంగు నిలువు గీతల షర్టు, నీలి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, షర్టు కాలర్‌పై సీను టైలర్స్, ఎస్‌కేపీ లేబుల్ ఉందన్నారు. మృతుడు ముస్లిం వర్గానికి చెందిన వాడై ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, ఎవరైనా బంధువులు గుర్తు పట్టినట్లైతే 7702629707 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

వరద బాధితులకు 'బీవీజీ' బాసట

నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేత


వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేస్తున్న మాధవరెడ్డి తదితరులు

బషీరాబాద్: జీవన్గీ వరద బాధితులకు తాండూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ సంపత్ కుమార్ బాసటగా నిలిచారు. ఆయన ఆధ్వర్యంలో నడిచే బీవీజీ ఫౌండేషన్ ద్వారా గ్రామానికి చెందిన 15 దళిత కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపించారు. ఈ నెల 10న కురిసిన భారీ వర్షానికి జీవన్గీలోని ఎస్సీ కాలనీ ముంపునకు గురైంది. దీంతో 15 మంది దళితుల ఇళ్లలోకి వరదనీరు చేరి నిత్యవసర సరుకులైన బియ్యం, పిండి పదార్థాలు, కూరగాయలు, బట్టలు ఇతర వస్తువులు పాడయ్యాయి. మరుసటి రోజు అధికారులు గ్రామానికి చేరుకొని ఒక్కో కుటుంబానికి పదికిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ ముంపు బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకొని డాక్టర్ సంపత్ తన ఫౌండేషన్ ద్వారా బుధవారం నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను గ్రామానికి పంపించారు. బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోటం మాణిక్‌రెడ్డి, నాయకులు సునీల్ ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి కిట్లను బాధిత కుటుంబాలకు అందజేశారు.

మైసిగండిలో ఎమ్మెల్యే పూజలు


మైసమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయాన్ని బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకున్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ , తులసీరాం, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం


దుద్యాల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదగిరి


మోమిన్‌పేట: ఏన్మతల ప్రాథమిక పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమేశ్

దుద్యాల్: డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దమని ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ రామారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో మాదక ద్రవ్యాలు నిషేధం

తాండూరు: వ్యవసాయ మార్కెట్ యార్డులో మాదక ద్రవ్యాలను నిషేధిస్తున్నామని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులు, డైరెక్టర్లతో కలిసి నిషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ లాంటి వాడకం వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ హబీబ్ హల్వీ, డైరెక్టర్లు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధకంలో భాగస్వాములవుతాం

మోమిన్‌పేట: మాదక ద్రవ్యాల నిరోధకంలో భాగస్వాములవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఏన్కతల ప్రాథమిక పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధకంలో ప్రతీ ఒక్కరం భాగస్వాములవుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను ఉపయోగించడం వల్ల విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నూడుల్స్‌లో నూనె తక్కువ వేశారని..


దాడిలో గాయపడ్డ వారిని చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది


అమర్‌నాథ్‌రెడ్డి తలపై అయిన గాయం

- మద్యం మత్తులో హోటల్ నిర్వాహకులపై దాడి
- పోలీసుల అదుపులో ఆరుగురు యువకులు

ధారూరు: నూడుల్స్‌లో నూనె తక్కువగా వేశారంటూ హోటల్ నిర్వాహకులపై దాడికి పాల్పడిన ఘటన నాగారంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భార్యాభర్తలు నీరటి భారతమ్మ, అంజి స్థానికంగా హోటల్ నడుపుతున్నారు. యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన పది మంది యువకులు బుధవారం సాయంత్రం ఫుల్‌గా మద్యం తాగి కారులో హోటల్ వద్దకు వచ్చారు. తినేందుకు నూడుల్స్ ఆర్డర్ చేశారు. ఈక్రమంలో నూనె తక్కువగా వేశారంటూ గొడవపడి భార్యాభర్తలపై మారణాయుధాలతో దాడి చేశారు. అడ్డు వచ్చిన అమర్‌నాథ్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపైనా దాడికి దిగారు. ఈ విషయమై గ్రామస్తులు ఫోన్ చేయడంతో ఎస్ఐ రాఘవేందర్, సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. పారిపోతున్న వారిలో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మరో నలుగురు తప్పించుకున్నారు. క్షతగాత్రులను వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తికి జైలు

కుల్కచర్ల: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష పడిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కుల్కచర్ల మండల కేంద్రంలో రత్నమాల కిరాణ దుకాణం నడుపుతున్నారు. 2024, సెప్టెంబర్ 22న గుర్తుతెలియని వ్యక్తులు సిగరేట్లు కావాలని దుకాణానికి వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. గొలుసు తెగి ఆమె చేతుల్లోకి పడింది. వెంటనే తేరుకొని అరవడంతో నిందితులు పారిపోయారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణానంతరం ఎండీ.జావీద్‌ను కోర్టులో హాజరుపరచగా బుధవారం పరిగి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ నిందితుడికి 18నెలల జైలు శిక్షను విధించారు.

108లో ప్రసవం

తల్లి, బిడ్డ క్షేమం


కూతురును ఎత్తుకున్న ఆమె బంధువు

ధారూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గిరిజన మహిళను బుధవారం 108 వాహనంలో తాండూర్‌లోని మాతాశిశు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండల పరిధిలోని రాంపూర్‌తండాకు చెందిన ప్రవీణ్‌నాయక్ భార్య మమత(24)కు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. భర్త వెంటనే 108 వాహనంలో భార్యను తాండూర్ మాతాశిశు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె ప్రసవించింది. పుట్టిన ఆడ శిశువును, తల్లిని 108 వాహన టెక్నీషియన్ శివకుమార్, బాల్‌రాజ్‌లు తాండూర్ మాతాశిశు ఆస్పత్రిలో చేర్చారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని అక్కడి వైద్యులు 108 వాహన సిబ్బందికి తెలిపారు.

మాజీ నక్సలైట్‌నంటూ బెదిరిస్తున్నాడు

డీసీపీకి ఇండిపెండెంట్ ఫెలోషిప్ పాస్టర్ల ఫిర్యాదు

మహేశ్వరం: మాజీ నక్సలైట్‌నని చెబుతూ.. దళిత క్రైస్తవులు, చర్చి పాస్టర్లను వేధించడమే కాకుండా, చర్చి స్థలాల కబ్జాలకు పాల్పడుతు న్న మందుముల సాయిలుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండిపెండెంట్ ఫెలోషిప్ సంస్థ పాస్టర్లు బుధవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డికి ఫిర్యాదు చేశారు. మహేశ్వరం, ఇబ్రాహీంపట్నం నియోజకవర్గాల్లో ని గ్రామాల్లో ఉన్న చర్చి పాస్టర్లు, క్రైస్తవులను బెదిరింపులకు గురిచే స్తూ చర్చి, సమాధుల స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడ ని పేర్కొన్నారు. బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకుడినంటూ గ్రామాలు, కాలనీల్లో కొంత మంది పేద పాస్టర్లతో ప్రభుత్వ స్థలాల్లో చర్చిలు పెట్టిస్తున్నట్లు తెలిపారు. అసైన్డ్, వివాదాస్పద భూముల్లో గుడిసెలు, రేకుల షెడ్లు వేయించి, కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. చర్చిల నిర్మాణం వంక చెబుతూ కానుకల పేరిట అక్రమంగా డబ్బులు వసూ లు చేస్తున్నాడన్నారు. పాస్టర్‌గా చెప్పుకొనే ఈయనకు చర్చిలు, క్రైస్తవ సంఘాల్లో ఎలాంటి సభ్యత్వం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో రాబిన్ జాయ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, జోనా తదితరులు ఉన్నారు.

చింతపట్లలో మేకల చోరీ

యాచారం: కొట్టంలో కట్టేసిన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతపట్లకు చెందిన ఎండీ బషీర్ మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద ఉన్న కొట్టంలో 11 మేకలను కట్టేసి ఇంటికొచ్చాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 5 గంటలకు కొట్టం వద్దకు వెళ్లగా మేకలు కనిపించలేదు. సమీప పొలాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించి సుమారు రూ.2లక్షల విలువైన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రతిఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలి


దాదాపూర్ నుంచి దోమ వరకు జాతీయ జెండాతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

- బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశం
- దాదాపూర్ నుంచి దోమ వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

దోమ: గ్రామాల్లోని ప్రజలు దేశభక్తి పెంపొందించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశం పేర్కొన్నారు. బుధవారం దాదాపూర్ గ్రామం నుంచి దోమ ప్రధాన చౌరస్తా వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. భారత దేశ ఐక్యతను మరోసారి చాటి చెప్పేందుకు ప్రజలంతా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధులు కంకల్ రవీందర్, మండల ప్రధానకార్యదర్శులు నర్సింహులు, అశోక్, మండల ఉపాధ్యక్షుడు సత్యం, శివకుమార్, శ్రీశైలం, కాశయ్య, నేతలు శ్రీకాంత్, శ్రీధర్, నర్సింహులు, వెంకట్‌రాములు, మైపాల్, బాలు, తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం


జైదుపల్లి అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వరద నీరు

జోరు వాన

వికారాబాద్‌లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. వాగుల వద్ద నీటి ఉధృతి పెరగడంతో అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు జనం ఇబ్బంది పడ్డారు. వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నిండు కుండను తలపిస్తోంది. ధారూరులోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి చేరిన వరద నీరు చెరువును తలపిస్తోంది. పరిగిలో ఏకధాటిగా కురిసిన వర్షంతో నక్కల్ వాగు పొంగి పొర్లింది.

– అనంతగిరి, ధారూరు


ధారూరు బస్టాండ్‌లోకి చేరిన వరద నీరు


నిండుకుండలా కోట్‌పల్లి ప్రాజెక్టు


పరిగి: పొంగి పొర్లుతున్న నక్కల్ వాగు



కంట్రోల్ రూం నంబర్లు